పరదేశి

ఊళ్ళోకి ఎవరో కొత్త మనిషి వచ్చాడు.

అతను బాగా పొడుగ్గావున్నాడు. ఎంత పొడుగో చెప్పాలంటే-ఆ వూళ్ళో తతిమ్మా జనాభా అంతా తేరిపారి చూడాలంటే వాళ్ల మెడలు కాస్తో కూస్తో నొప్పి పుట్టి తీరాలిసిందే! మనిషి మాత్రం సన్నగా గెడకర్రలా వున్నాడతను. అతను నెత్తిమీంచి టోపీ గనక తీస్తే కోడి గ్రుడ్డులా నిగనిగ లాడ్తున్న అతని బుర్రమీద మచ్చుకన్నా వెంట్రుకలు కాసిని నాలుగు పరకలన్నా లేకపోవటం నవ్వు పుట్టిస్తుంది. కంటి మెడ చొక్కాయి వేసుకున్నాడు. ఆ చొక్కామీదనే మాసిపోయి అట్టలుకట్టిన నెహ్రూకోటు కూడా వుంది. ముడుతలుమీదకి బాగా యెగ్గట్టిన ధోవతీ-అరిగిపోయిన ఎర్రమట్టిరంగు కాన్వాసుజోళ్లు వేసుకుని బుజాన కాస్తంత పెద్దసైజు గుడ్డలమూట ముడిలోకి తగుపాటి చౌకైన నల్లటి పొడుగాటి చేతికర్రదూర్చి, మిటమిటలాడే ఎండలో పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ, వుండి వుండి నూతిలోంచి వస్తూన్నట్లున్న కీచు గొంతుకతో 'సతరంజీ ...' అని అరుచుకుంటూ ప్రక్క-ప్రక్కలకు ఆగి యెవరేనా పిలుస్తున్నారేమోనని చూసుకుంటూ పోతున్నాడు.

ఒకరకం జనుమునుంచి తీసిన నారపట్టుతో నూలు జోడించి దుప్పట్లలా మామిడి అంచులతో చాలా చక్కగా మన్నికగా వుండేందుకు తయారుచేసిన గోధుమరంగు తానులను 'సతరంజీ' లని బీహారీలుతెచ్చి గుమ్మంలోయిళ్ళముందు అమ్ముతూంటారు. ఇవి దగ్గరదగ్గరగా బరంపురం పట్టుబట్టలలాగే వుంటాయి. మగవాళ్ళు ఆడవాళ్ళు మీదను సుఖవుగా శాలువలా కప్పుకు హాయిగా తిరగొచ్చు.

ఈ సతరంజీల మనిషి నిలువుగా మంచి గంధంతో బొట్టు పెట్టుకున్నాడు. వీళ్లకు కాస్తోకూస్తో తెలుగు, ఒరియా, హిందీ, అరవం, బెంగాలీ, మరాఠీ అన్నిభాషలువచ్చేవుంటాయి. దేశద్రిమ్మరులు, ఒకమాటు పిలిచి మూట దింపించామంటే, ఆరు రూపాయలకు యిచ్చేవస్తువును అరవై రూపాయలనుంచి బేరం తగ్గించుకుంటూ చివరకు అంటగట్టిగాని

యింటిముందు నుంచి కదలరు. గంట గంటన్నర బేరంలో-వాళ్లు వారి వారి జీవితాలు కష్టసుఖాలు వారిదేశం స్థితిగతులు మంచీచెడ్డా అంతా మాట్లాడి మన పుట్టుపూర్వోత్తరాలు అన్నీ అడిగి చెప్పిపోతారు.

ఎక్కడో తింటారు. ఏ బజారులోనో సత్రపు అరుగుమీదో రాత్రిళ్ళు కాలక్షేపం చేస్తారు. ఉదయం పోస్టాఫీసు దగ్గర తమ తమ కుటుంబాలకు డబ్బు పంపించే సందర్భంలో- వారి వారి యోగ క్షేమాలు తెల్సుకునేందుకు వుత్తరాల కోసమో గొప్ప ఆతృతతో కూర్చుంటారు. మనియార్డరు ఫారాలు రాసి పెట్టమంటారు. కవర్లమీద చిరునామాలు రాయించుకుంటారు, ఇంగ్లీషు వుత్తరాలు తెచ్చి చదివించు కుంటారు. ఈ తిరుగుబోతుల్ని కదిలిస్తే యెన్ని యెన్ని అద్భుతాలు చిత్ర విచిత్రాలు చెబుతారో అవన్నీ నమ్మేందుకు వీలు లేకపోయినా, ఆశ్చర్యంగా వుండి గొప్ప కాలక్షేపం మాత్రం అవుతుంది.

ఈ పొడుగు మనిషి వూళ్లోకి రాగానే అతడికి అంతా 'లంబూ' అని పేరు పెట్టారు. లంబూ-విగ్రహం గ్రామంలోకి వచ్చిన నాటిరాత్రి బజారు సావట్లోంచి మధురాతి మధురమైన మురళీగానం ఆ వూరివారంతా విన్నారు. 'లంబూ' సతరంజీల మూటలో ఒక పిల్లనగ్రోవి కూడా వుండటం ఒకరిద్దరు చూశారు.

కొన్ని కొన్ని వూళ్ళల్లోకి క్రొత్త అనేదియేదీ, దానంతటది హఠాత్తుగా రావటానికి వీల్లేదు. హఠాత్తుగా వచ్చేది యేదన్నా దాన్ని చిలవలూ పలవలూ చేసి చెప్పుకుంటారు.

చుట్టాలు వస్తారు-వెడతారు.

ఎవరింట్లోనో ఓపాపాయి పుడుతుంది. ఎక్కడో భావిదగ్గరఫలానా వారింటికి క్రొత్తకోడలు వచ్చిందని అమ్మలక్కలంతా చెప్పుకుంటారు. ఫలానావారి అల్లుడొచ్చాడని చాటుగా యెన్నివంకలు బెట్టినా పదిమందీ పలకరించి మర్యాదగా మాట్లాడుతారు. ఇల్లా జరిగే క్రొత్త క్రొత్త విషయాల్లో ఒక పద్ధతి తరహా అంతావుంది. దేన్నీ ఆప్టే కాలం క్రొత్తగా వుండనివ్వరు మనుష్యులు.

తోటలు దొడ్లూ-తూముకాలువలు సందులు గొందులు-పాడుపడిన గోడలు రోజూ చూడ్డానికి మామూలు అనుకోడానికెంత అలవాటుపడ్డారో, స్త్రీలు పిల్లలూ, ముసలీ-ముక్కా యీ ముఖాలన్నీ మామూలే అయిపోయాక, ఎక్కడ్నుంచో ఒక క్రొత్త మనిషి వచ్చినప్పుడు, ఆ పరాయి వ్యక్తికళ్ళతో చూసి ఫలానాచోటు సుందరంగా వుందని. ఫలానా వీధి మురుగెత్తిపోతూందని, ఎవరోపిల్లలు అందంగా చలాకీగా బాగా ఆడుకొంటున్నారనీ, స్త్రీలు శుభ్రంగా అలంకరించుకుంటారనీ ఇవన్నీ ఎవరో చెప్పేదాకా మనకు తెలియని పరిస్థితిలో పడిపోతాం. అంతే యేమీ లేదు.

ఒక మంచినిగాని, ఒక అందాన్ని గాని, ఒక గొప్పతనాన్నిగాని యెవరో వచ్చి మనకు చెప్పేవరకూ, అలాటివి కొన్ని మన పరిసరాల్లోనే వున్నాయని మామూలుగా మనుష్యులు కనుక్కోలేరు. ఈ పైనుంచి వచ్చిన శక్తితో మనకళ్ళు విప్పటానికి అన్ని వేళలా అవకాశమివ్వరు ప్రజలు, ఇందుకు కొంతఘర్షణ వాస్తవంగా కొంత సత్యాన్ని చిత్రహింస పెట్టడం జరుగుతుంది.

ఊళ్లో అంతా మామూలు మనుష్యులే-పోస్టుమాస్టరు-పోస్టాఫీసు, స్కూలు-పంతుళ్ళూ, ఒక వుమాపతి డాక్టరు, ఒక మంత్రసాని, పోలీసు స్టేషను, ఎవరో చిన్నచిన్న వృత్తులూ వుద్యోగాలు చేసేవాళ్ళు, కరణమూ మునసబూ, దుకాణాల షావుకార్లు, బడా బడా సేట్లు-రైతులు కూలీలు అంతా వున్నారు. గ్రామానికి తూర్పున చక్కటి వేణుగోపాలస్వామి కోవెల వుంది. కోవెల వెనుక అందమైన తోటవుంది, తోటలో ముచ్చటైన కోనేరు.-కోనేటి గట్లచుట్టూ మందార మొక్కలు, గన్నేరు చెట్టు పూలతో వంగి, యింకా హాయినిగొలిపే అనేక రకాల పిట్టలూ కోయిలలు పావురాల మధ్య రోజ స్తమానమూ పిల్లలు రకరకాల ఆటలు ఆడుకుంటూ పాడుకుంటూ పొద్దులుబుచ్చుతారు.

ఆ కోనేటికి ఆడవాళ్లు తమతమ పిల్లల్ని నడిపించుకుంటూ చంకలో బిందెలతో వచ్చి వుదయం కబుర్లాడుతూ కష్టసుఖాలు చెప్పుకుంటూ స్నానాలుచేసి ఒయ్యారంగా ఇళ్లకు వెళ్ళిపోతూంటారు.

అల్లాటిది భాగల్పూరునుండి చొక్కాల తానులు దుప్పట్లు బుజాన్నేసుకుని వీధి వీధి తిరిగిన 'లంబూ'కి ఆ గ్రామం చాలా చిత్రంగా వున్నట్లు తోచింది. సాధారణంగా 'లంబూ' వీధిలో తిరుగుతూంటే పిల్లలు గుంపులు గుంపులుగా వెంబడించి కేకలు వేస్తూ అల్లరుచేస్తూ విసిగించేవారు. సాయంత్రాలు చీకటిపడ్డాక ఎక్కడ పడితే అక్కడ పిల్లలు దారి అటకాయించి మురళివాయించమని పీకేసేవారు. అట్లాటి దిప్పుడా వూళ్ళో —రోజల్లా వీధివీధి తిరిగినా మచ్చుకన్నా ఒక చిన్నపిల్ల వీధిలోకి రావడం కనపడలేదు. మొత్తం వూళ్లో ఎవరికీ పిల్లలున్నట్లేలేదు. పిల్లలు లేకుండా వున్నవూరు ఎంతఅందంగా గొప్పగావున్నా అక్కడ నిల్చోటానికికూడా లంబూకి మనసు వప్పటంలేదు, కొనేటిదగ్గర ఆడవాళ్లముఖాలో భయం దోబూచు లాడుతోంది- ఎవరికీ వూళ్లో పిల్లలు లేరనటానికి వీల్లేదు. అస్సలట్లా పిల్లలు లేకుండా వున్నవూరు ఎక్కడన్నా వుండగలగటం అసంభవం! పోతే అంతా తమతమ పిల్లల్ని యిళ్లలో దాచేసుకునన్నా వుండాలి-ఎక్కడో గదుల్లో కదలకుండా కట్టి పడేసన్నా వుంచాలి.

'లంబూ' మనుష్యులందర్నీ చాలా జాగ్రత్తగా తేరిపారచూసి-కనుక్కున్నాడు. అందరిముఖాల్లోనూ 'భయం-సందేహం-అనుమానం' యీ లక్షణాలు చీకటితెరల్లా దించుకొనున్నాయ్.

ఎవరింటిముందన్నా ఆగి సతరంజీలు అండీలు కావాలా అని తనుఅడిగినప్పుడల్లా, వాళ్ళ ముఖాలు మీదకు విరుచుకుపడే పెద్దపులుల్లా చీల్చుకు తినటానికి సిద్ధంగా వున్నట్లున్నాయి.

ఈ గ్రామానికి ఏదో పెద్ద ఆపత్తు వచ్చింది - పాపం మనుష్యలంతా భయాందోళనల్లోపడి కొట్టుకొంటున్నారు. పిల్లల్ని ఎక్కడా కవబడ నియ్యటంలేదు. కారణం యేమైవుంటుందా అని లంబూ దీర్ఘంగా ఆలోచనలో పడ్డాడు.

ఆరోజు జరిగిన సంగతులన్నీ గుది గుచ్చినా లంబూకి తలా తోకా అంతు చిక్కటంలేదు,

మధ్యాహ్నం ఎవరింట్లోనో ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి నాలుగేళ్ళ కుర్రాడిని వ్రేలుపుచ్చుకుని గుమ్మంలో నిలబడి వీధిలోకి చూస్తూండగా తను దాహంవేసి మంచినీళ్లు అడిగాడు,

ఆ అమ్మాయికెవ్వుమని బిగ్గరగాఅరచి తలుపు దభాల్నవేసుకుంది. కోనేటి దగ్గర గన్నేరు చెట్టు నీడలో తను సత్తుపింగిలో పచ్చి మిరపకాయలూ, నీళ్ళూ పోసుకుని పిసుక్కొని నాలుగుముద్దలు నోట్లో వేసుకున్నాడో లేదో, దాహంవేసి కోనేటి మెట్లవద్దకు నీళ్ళకోసం పోయి వంగుంటే - మెట్లు మీంచి తడిబట్టల్తో బిందె నెత్తిన పెట్టుకుని వస్తూన్న ఆవిడెవరో ఘటాన్ని మెట్లమీదయెత్తేసి కంగారుగా దవుడు తీసింది. కొలనులో స్నానం చేస్తున్న యిల్లాలు గాభరా యెత్తిపోయి బుడుంగు భుడుంగున మునకలేస్తూ నీళ్లు గుటగుట త్రాగేస్తోంది,

నిజంగా వీళ్ళంతా కొత్తమనిషినిచూసి జడుసుకున్నట్లున్నారు. 'లంబూ' చాలావిచారించాడు. నిజంగా తను చాలా పొడుగ్గా వుండటం వల్ల యీ వూళ్ళో అంతా తన్ను అనుమానంతో, సందేహంతో, భయంతో చూస్తున్నట్లున్నారు. తన దగ్గర మూటలో ఒకకత్తెరా గజం బద్దా, పిల్లనిగ్రోవీ తిప్ప మరే ప్రమాదకరమైన ఆయుధమూ, వస్తువా వున్నట్లులేదు,

సంతపాకల్లో రాత్రి ఆతడికి ఎంత బలవంతాన రప్పించుకుందామన్నా కంటికి కునుకే పట్టలేదు. తల్లక్రింద పక్షులు చీకట్లో రెక్కలు టప టపా కొట్టుకొంటూ సంచారంచేస్తున్నాయి. గాలి విసురుగా వీచినప్పుడల్లా చలికి ముడుచుకొని కంబానికి జారగిలబడ్డ 'లంబూ' మీద సంతపాకల్లో మీదనుండి తరతరాలనాటి బూజు మన్ను పెంకులు వుండి వుండి రాల్తూ విశ్రాంతిని భంగంచేస్తున్నాయి.

మీదను మినుకుమినుకుమనే నక్షత్రాల్ని చూస్తూ 'లంబూ' పిల్లన గ్రోవితీసి వాయించసాగాడు. రోడ్డుమీద కల్లుపాకనుంచి అమృతం పుచ్చుకున్న దేవతలు దొర్లుకుంటూ, వూగులాడుకుంటూ, బిగ్గరగా కేకలుపెడ్తూ జట్లుజట్లుగా చీకట్లో కలిసిపోతున్నారు. గాఢాంధకారంలో

చెట్టుమీద రెక్కల్ని కప్పుకుని గూళ్ళలో కన్నుమలిపిన నానాపక్షి సంతానమూ, 'లంబూ' మురళీ నాదాన్ని వింటూ, మెచ్చుకుంటూ హర్ష ధ్వానాలు చేశాయి.

ఆ వూళ్ళో ఒక పచ్చి కసాయి, కరకు పొగరుమోతు పరమ దుర్మార్గుడైన మనిషి ఒకడున్నాడు. అతగాడికి చాలా పెద్ద మీసాలు, గుడ్లు, భీకరమైన బొజ్జ - చూడ్డానికి ఘటోత్కచుడికి మల్లేనే వుంటాడు. పగలు చూస్తే రాత్రి కల్లోకొస్తాడు. పిల్లలువాడిని చూస్తే జడుసుకుని పాలైనా త్రాగరు. అతగాడు అస్తమానం రాత్రిళ్ళు నిశాచరుడిలా వూరంతా తిరుగుతూ బాటసారుల్ని - కొత్తమనుష్యుల్ని హడలుగొట్టి పీడించుక తింటూ వుంటాడు, ఈ పెద్దమనిషికూడా అమృతం సేవించి దొర్లుకుంటూ, దొర్లుకుంటూ పిల్లనగ్రోవి పాటనుబట్టి సంత వసారాలో కొచ్చి అక్కడ గడకర్రలాటి 'లంబూ'ని పసిగట్టి - వూరికే పాదం చరుస్తూ బుసలు కొట్టడం ఆరంభించాడు.

'లంబూ' మురళి వాయించటం ఆపి - 'ఎవరక్కడ భయ్యా' - అని అడిగాడు.

'దేవతలం మేం - అమృతం తాగొచ్చాం. ఇక్కడ గెడకర్ర లాటి దేమో మెసుల్తూ వుంటే కాస్త సరిజేద్దామనిపించింది మాకు.' 'లంబూ నవ్వాడు.

'ఈ గట్టుమీదకు వచ్చి కూర్చో అన్నయ్యా, అమృతం చెవుల్లో కురిపిస్తాను. ఈ చీకట్లో నీ హృదయం గట్లు త్రెంచుకుని పరుగెడ్తుంది అని మళ్ళీ పిల్లనగ్రోవిని పెదిమలకు తాటించాడు.

'ఏంటో వాగుతాడు - బద్మాష్! నీలాటి ముండాకొడుకుల్ని యీ స్తంభాలకేసి రెక్కలు విరిచి కట్టెయ్యాలి. ఊళ్లోంచి కదలి పోనివ్వకూడదు' ఇంకా బుసలుకొడుతూనే వున్నాడు.

పాట హెచ్చుస్థాయిలో తరంగాలు తరంగాలుగా నాలుగుదిక్కులూ చుట్టుముట్తోంది.

లంబూకు వినిపించేలా - 'నేను నాగుబాములాటివాడ్ని -' వికటంగా బిగ్గరగా నవ్వాడు పాట ఆపేసి లంబూ—

'ఇది తెలుసా - యిది మ్రోయిస్తే పన్నగాలచేత విషం కక్కించి తీరుతుంది'.

హఠాత్తుగా ఆ వ్యక్తి 'లంబూ' చేతిలోని మురళినిలాక్కుని నోటిదగ్గర పెట్టుకుని వికృతంగా ధ్వనులు చేస్తూ చీకట్లోకి పరుగెత్తాడు.

లంబూచేతు లెత్తి బిగ్గరగా అన్నా - అన్నా అది నీకు ఎందుకూ పనికిరాదే. రా! రా ! యిచ్చెయ్యన్నా - నా ప్రాణం....నా సర్వస్వం—! గొంతుక జీరపడిపోయింది. లంబూకి చాలా కోపంవచ్చింది. బజారు సావిట్లో నిలబడి చేతులెత్తి శాపనార్థాలు పెట్టడం సాగించాడు ఆ దుర్మార్గుడి పెంకె తనానికి. లాక్కున్న పిల్లనగ్రోవిని వికృతంగా వూదుతా, ఆ పొగరుబోతు ఒక సందులో, సన్నటి దీపంవద్ద పాను దుకాణంలో, ఆకుపచ్చ చీర, ఎర్రగా తమలపాకులు నమిలి నమిలిన గారపెదవులు, మెడనిండా పచ్చ బంగారంతో కూర్చున్న స్త్రీ వద్దకు వచ్చి నిలబడి గొప్ప ఘనకార్యం చేసిన వాడిలా ముసిముసి నవ్వులు ఆరంభించాడు.

'అదేవిఁటా - మురళి-'

'ఎత్తు కొచ్చాను-'

'అల్లా వికృతంగా వస్తున్నాయే ధ్వనులు'-

'ఇందాకటి దాకా బాగానేవుందిమరి. ఆ ముండాకొడుకు చేతి లోంచి లాక్కున్నాక నువ్వన్నట్లే కర్ణకఠోరంగా వస్తున్నాయి ధ్వనులు.'

'తెలిసిందా ?'

'ఏవిఁటి ?'

'నువ్వు దుర్మార్గపు మనిషిని-అల్లాటి మధురమైన వాద్యాలు ఎంతో సున్నితమైన మనస్సు గలవాళ్ళు వాయిస్తేనే పలుకుతాయి. అవన్నీ

మంచివాళ్లు చేపట్టాలి-నీబోటి లుచ్చాలు ముట్టుకుంటే కఠోరమైన శబ్దాలే వస్తాయి.'

'నిజంగా ....'

ఆ కరోడా మనిషి ఎంతో ఎత్తునుంచి దభాలున కూలపడినట్లు అయిపోయి, యిక అక్కడ ఆగకుండా లంబూపరున్న బజారు పాకల వద్దకు రొప్పుకుంటూవచ్చి-దానితో కోడి గ్రుడ్డులాటి లంబూ నున్నటి తలమీద 'తమ్ముడూ-తమ్ముడూ' అంటూ వాయించాడు.

లంబూ లేచికూర్చున్నాక—

'తమ్ముడూ-అమృతం నేనుతాగినా దేవతవి నువ్వే. నువ్వు ఎంతో మంచి వాడివి కాబట్టి నువ్వు వాయించినప్పుడే అమృతం చెవుల్లో కురుస్తుంది. పాడు భాయ్!

లంబూ నిశ్శబ్దంగా చాలాసేవు వాయించాక-నెమ్మదిగా 'అన్నా-యీవూళ్లో పుదయంనుంచీ ఎక్కడా పిల్లా జెల్లాతిరుగుతూవున్నట్లులేదు' అని తన అనుమానాలూ, జరిగినవీ పూసగ్రుచ్చినట్లు చెప్పాక-కరోడా గంభీరంగా యిలా అన్నాడు :

ఇక్కడ పిల్లల్ని ఎత్తుకుపోతున్నారనే వదంతి వచ్చిపడింది. భాయీ! ఎత్తుకపోయి ఎక్కడో మామ్మాయి వండుతున్నారట. పిల్లల్ని ఇళ్లల్లోంచి బైటకు రానివ్వటంలేదు. క్రొత్త వాళ్లనిచూసి భయపడు తున్నారు. ఊరంతాభయభ్రాంతులై వున్నారు. ఎవరూ దేన్నీనమ్మటంలేదు!

లంబూ 'అరె-బాప్రే-' అని అరిచి-అదంతా నిజమంటావాభాయ్? పిల్లల్ని యెవరేనా ఎత్తుకపోయి వండుకుంటారా-ఇల్లాటి పిరికిమందుపెడ్తే జనం మరీ పుంజాలు తెంపుకుంటారు. నాకు నమ్మకం చాలటంలేదబ్బా— 'కరోడా' చాలా రాత్రివరకూ పిచ్చా పాటీ చెప్పి 'లంబూ'ని స్నేహితుడ్ని చేసుకుని కాస్సేపు పొగిడి చీకట్లో మాయమై పోయాడు. అమర్నాడు అనుకోకుండా ఒక చిత్రమైన సంఘటన జరిగింది. సాయంత్రం

లంబూ-బుజాన్న బట్టలమూటను వేసుకుని వీధివీధులూ అమ్ముకుంటూ కేకలేస్తూ తిరుగుతున్నాడు.

అప్పుడొక సందులో నిర్మానుష్య మైనచోట ఒక నాలుగేళ్ళ కుర్రాడు గుక్కబట్టి బిగ్గరగా యేడుస్తున్నాడు. చుట్టుపట్ల ఎక్కడా జనసంచారంలేదు. ఇళ్ళుకూడా లేవు. పాపం ఎవరో పిల్లాడు తప్పిపోయి యేడుస్తున్నాడు. లంబూ జాలిపడ్డాడు. ఆపిల్లడ్ని రమ్మని దగ్గరకు తీసుకుని శతవిధాల బుజ్జగించాడు. వాడికి మాటలుకూడా చెప్పటంరాదు. గ్రుక్క తిప్పుకోకుండా యేడుస్తున్నాడు. తినడానికి యేమన్నా యిద్దామన్నా లంబూదగ్గర యేమీ పిల్లలకు పెట్టే మిఠాయిలాటి వస్తువులేదు. ఆపిల్లడ్ని ఎత్తుకుని తూముకాలువ వంతెనమీద కూర్చోబెట్టి అమ్మా-నాన్నా ఎక్కడో చెప్పమనీ లంబూ బ్రతిమాలాడు. వాడు కాళ్లు దబదబా నేలను బాదుతున్నాడేగాని యేమీ వినిపించుకోటంలేదు. పొట్ట పగిలి పోతుందేమో నని భయం పట్టుకుంది లంబూకు. ఆలోచించి మురళి పైకి తీశాడు. నెమ్మదిగా ఎదురుగుండా చతికిలబడి వాయిస్తూ కూర్చున్నాడు. పిల్లవాడు యేడుపుమానేసి నవ్వుతూ తప్పట్లుతరుస్తూ గెంతుతున్నాడు.

ఈ రసకందాయప్పట్టులో యెక్కడ్నుంచో గెద్దల్లాగవచ్చి వాలారు అరడజనుమంది మనుష్యులు. వాళ్ళ వచ్చీరావటం 'లంబూ'ని ఎడరెక్క పెడరెక్క విరిచి పట్టుకున్నారు. పిల్లవాడ్ని మరొకరు ఎత్తుకున్నారు. తతిమ్మా ముగ్గురూ బడితపూజ ఆరంభించారు.

'దొరికాడు-పిల్లడ్ని ఎత్తుకు పోతున్నాడు మోసం చేసి.'

'చంపండి! నరకండి! చెట్టుకు కట్టేసి-కాళ్ళక్రిందనించి మంటలు పెట్టండి. శిశు హంతకుల్ని ముక్కలు ముక్కలు క్రింద కోసి కాకులకూ గ్రద్దలకూ పారెయ్యాలి.'

జనం శివమెత్తిపోయివున్నారు.

'లంబూ' మూటను చిందరవందర చేసిపారేశారు. బుర్ర చితక పొడిచాక ముఖం పగిలి నెత్తురు వోడుతున్నా-లంబూ-

'బాబోయ్-నేను పిల్లల్ని యెత్తుకు పోయేవాడ్ని కాను' అని ఎంత మొత్తుగున్నా యెవరూ చెవిని పెట్టటం లేదు.

అల్లా దారిపొడుగుతా తన్ను కుంటూ రోడ్డుమీద యీడుస్తూ జనమంతా లంబూను తీసిగెళ్ళి-బాదం చెట్టు మొదట్లో పగ్గాలువేసి చెట్టుకు ఏసుక్రీస్తును శిలువవేసినట్లు కట్టారు, వంటినిండా గాయాలు-బాదంచెట్టు నిండా కండచీమలు బారులుతీర్చి పాకుతున్నాయి. లంబూ మొర్రో మొర్రో మంటూ భీకరంగా అరుస్తున్నాడు. చుట్టూ జనం నిలబడి వంతులు వేసుగుని కాపలా గాస్తున్నారు.

ఈ శిశుహంతకుడ్ని చూడ్డానికి ఆపూరిజనం తండోపతండాలుగా రాసాగారు. తెల్లవారక్కర్లేదు. తెల్లవార కుండానే ఆ చీమలు 'లంబూ'ని మట్టుపెట్టవచ్చు.

ఈ భీకరమైన సన్నివేశం మధ్యలో కరోడా ఆకాశాన్నుంచి వూడిపడ్డట్లు వచ్చి - 'విప్పండి - కట్లు! విప్పుతారా - లేదా? లంబూని చంపకండి. లంబూని చంపారో మీయిళ్ళల్లోదూరి మిమ్మల్ని వొక్కొక్కళ్ళని హతమారుస్తాను' అని సింహంలా గర్జించాడు. జనం ఎదురు తిరిగి వివరంగా జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పారు!

కరోడా యెవరు యెంత అడ్డుచెప్పినా వినిపించుకోకుండా 'లంబూ'ని బాదంచెట్టునుంచి పగ్గాలు కోసి విడిపించి - 'తమ్ముడూ నువ్వు పిల్లల్ని యెత్తుకుపోలేవు, ఈ వూరు వూరంతా నీకు అత్యాచారం చేసింది. ఇదుగో నీబట్టలమూట పోతేపోయింది. నీ మురళి.........యిది పాడు కుంటూ నీ యిల్లు, నీదేశం, నీపిల్లలు, నీ యిల్లాలు అంతా యెక్కడున్నారో అక్కడి కెళ్లు. నిన్ను క్షమించమనిఅడగటానికి యీ గ్రామానికి హక్కులేదు, ఐనా నువ్వు మంచివాడివి. ఈ చీమలు నీ గాయాల్ను పొడుచుకుతిన్నా నీ వెవరికీ యే అపకారమూ చెయ్యలేవు. తమ్ముడూ వెళ్ళిపో—'

అందరూ చూస్తూండగా లంబూ మురళిని ఎత్తుకుని యీడ్చుకుంటూ చీకట్లో తన మార్గం వెతుక్కుంటూ వెళ్ళిపోయాడు.

కరోడా జుత్తు పీక్కుంటూ అరుస్తున్నాడు.

'నిన్న మీరంతా అతడి పిల్లనగ్రోవి వాయిద్యాన్ని తనివితీరా విన్నారు. ఎంత మాధుర్యం - ఎంత మంచి మనస్సు, ఎంత సుకుమారమైన ఆలోచనలు, ఎంత రసమయమైన గానం - అంత గొప్ప సంగీత వాద్య శక్తికల మనిషి యిల్లాటి పిల్లల్ని యెత్తుకొనిపోయి వండుకు తింటాడని మీరెట్లా అపోహపడ్డారు? మీపిల్లాడ్ని యేడుస్తూంటే తన మురళీ వాద్యంతో వూరుకోబెట్టి ఆడించాడు. గొప్పకళారాధకుడు శిశుహంతకు డెల్లా అవుతాడు: ఓ బుర్రలేని దౌర్భాగ్యుల్లారా.... మీరంతా....చేతులారా....ఎంత చిత్రహింస బెట్టారు? ఇదా పరదేశుల్ని ఆదరించే తీరు.... !

రొప్పి రొప్పి కరోడా చాపచుట్టలా దీనినిచెప్పి నేలమీద వాలిపోయాడు. ఎప్పటిలా చీకటి గ్రామాన్ని చుట్టుముట్టేసింది. ఎప్పటిలాగే నక్షత్రాలు మినుకు మినుకు లాడేయి. దేవతలు అమృతం తాగొచ్చి వీధుల్లో తందనాలాడుతూనే వున్నారు.

ఆ చీకట్లో పరదేశి - పిల్లనగ్రోవీ సతరంజీల కేక - మళ్ళీ ఆ వూరి వాళ్ళు విననోచుకోలేదు. నెత్తురోడుతూన్న దేహభారంతో కుంటు కుంటూ కాళ్ళీడ్చుకుంటూ 'లంబూ' ఆ చీకట్లో తన మార్గం ఎట్లా వెతుక్కున్నాడో- యింకా ఎన్ని సందేహాలు, అనుమానాలు అవమానాలకు గురి అయ్యాడో చెప్పటం కష్టం.

ఒక గొప్ప కళారాధకుడు, ఒక చిత్రకారుడు, ఒకకవి, గాయకుడు చచ్చురకం నేరస్థుడు కావటం అసంభవమని చెప్పాలను కుంటాడు కరోడా.

కాని చెప్పడానికి కావలసిన సంస్కారం, మాటలు, మార్గం మాత్రం అతగాడికి పట్టుపడలేదు నాటినుండి నేటివరకూ.